సాక్షి కామారెడ్డి

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



నైతిక బాధ్యతగా ఓటేయాలి

ఓటరుగా నమోదైనవారు నైతిక బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు.

- 8లో ▸



ఆదరించండి

నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి చేసే వారినే ఆదరించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /21.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు మహమ్మద్‌నగర్‌కు ఎమ్మెల్సీ కవిత రాక



నిజాంసాగర్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం మహమ్మద్‌నగర్‌కు రానున్నారు. మహమ్మద్‌నగర్ మండలంతోపాటు తహసీల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు పరిశీలించారు. సభా స్థలంతో పాటు వాహనాల పార్కింగ్ స్థలం, వేదిక ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారులతో చ ర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పాల్గొనే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరా రు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, వాజీద్‌అలీ, సంగమేశ్వ ర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, శ్రీధర్‌రెడ్డి, రాములు, అఫ్జల్, బాన్సువాడ రూరల్ సీఐ మురళి ఉన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



బాన్సువాడ రూరల్: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బాన్సువాడ పర్యటన ఏర్పాట్లను శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. మంత్రి ఈనెల 4న బాన్సువాడకు రానున్న విషయం తెలిసిందే. బాన్సువాడలోని అంగడి బజార్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని స్పీకర్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.



శాకాహారిజం

- ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ
- వెజిటేరియన్లుగా మారుతున్న జనం

ముక్కలేనిదే ముద్ద దిగదు అన్న వాళ్లు కూడా ఈ మధ్య కాలంలో శాకాహారం వైపు మళ్లుతున్నారు. దీనికి రకరకాల కారణాలు చెబుతున్నారు. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో శాకాహారమే సరైనది అనే భావన పెరుగుతోంది. దీంతో చాలామంది నాన్‌వెజ్ మానేసి, పూర్తిగా వెజిటేరియన్లుగా మారిపోతున్నారు. మరికొందరు ఆధ్యాత్మిక భావనతో మాంసం తినడం మానేస్తున్నారు. ఆదివారం ప్రపంచ శాకాహార దినోత్సవం సందర్భంగా కథనం..



కామారెడ్డిలో శాకాహారుల ర్యాలీ (ఫైల్)

సాక్షి, కామారెడ్డి: ఆచార వ్యవహారాలలోలాగే ఆహారపుటలవాట్లలోనూ భిన్నత్వం ఉంటుంది. ఎవరికి నచ్చినది వారు తినడం సహజం. కొందరికి మాంసాహారమంటే ప్రాణం.. జీవహింసకు దూరంగా ఉండేవారికి ఇది పాపంలా కనిపిస్తుంది. వారు పూర్తి శాకాహారులుగా ఉంటారు. కాలం గడిచే కొద్దీ అలవాట్లలోనూ మార్పులు చోటుచేసుకుంటుంటాయి. ఒకప్పుడు నాన్‌వెజ్ అంటే నాలుక కోసుకునే వారు సైతం క్రమంగా శాకాహారులుగా మారే అవకాశాలుంటాయి. ఆధ్యాత్మిక భావన పెరిగి ఇంకొందరు, వైద్యుల సలహాలతో ఇంకొందరు వెజిటేరియన్లుగా మారిపోతున్నారు. శాకాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిదని, మాంసంతో పోలిస్తే వెజిటేరియన్ ఫుడ్ త్వరగా జీర్ణం అవుతుందని నమ్ముతున్నారు. పలు సంస్థలు సైతం సర్వేలు చేసి మాంసాహారులకంటే శాకాహారులే మెరుగైన ఆరోగ్యంతో జీవిస్తారని తేల్చాయి. ఇటీవలి కాలంలో చాలామంది వెజిటేరియన్లుగా మారుతున్నారు. దీంతో శాకాహారంపై చర్చ జరుగుతోంది. శాకాహారం వల్ల గుండె పదిలంగా ఉంటుందని, హృదయ సంబంధ సమస్యలు దరిచేరవని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. బీపీ, షుగర్ అదుపులో ఉంటాయంటున్నారు. జీర్ణక్రియ మెరుగుపడుతుందని పేర్కొంటున్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో గతనెల 17వ తేదీన కామారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శాకాహారం ఆరోగ్యానికి మంచిదని చెబుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కూరగాయలతో కూడిన భోజనం చేస్తే సులువుగా జీర్ణం అవుతుందని, దానికి తోడు జీవహింస పాపం నుంచి దూరంగా ఉండొచ్చని వారు వివరిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో శాకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలూ చేపడుతున్నారు. దీంతో క్రమంగా శాకాహారంపై అవగాహన పెరిగి పలువురు మాంసాహారానికి దూరమవుతున్నారు.

సండే స్పెషల్



శాకాహారం ప్రాధాన్యతను తెలిపే ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు, తలపై కూరగాయలతో..(ఫైల్)

జీవితాంతం శాకాహారిగానే..



గతంలో మాంసాహారిని. అవగాహన వచ్చాక మారిపోయా. ఇక జీవితాంతం శాకాహారిగానే ఉంటా. మా కుటుంబ సభ్యులూ నా దారిలోనే నడుస్తున్నారు. మాంసాహారం తినడం వల్ల అనేక నష్టాలున్నాయి. అందుకే శాకాహారిగా మారిపోయాం.

– భూంరెడ్డి, రైతు, గర్గుల్

సాత్వికంగా ఉండాలంటే...



నేను చిన్నపుడు స్వాధ్యాయకు వెళ్లాను. సాత్వికాహారంతో సాత్వికంగా ఉంటామని తెలుసుకున్నాను. శాకాహారం తీసుకుంటే శారీరకంగా, మానసికంగా బాగుంటాం. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శాకాహారం ప్రాధాన్యతను వివరించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం.

– చంద్రశేఖర్, టీచర్, కామారెడ్డి

ఎంత ఒత్తిడి చేసినా..



శారీరకంగానే కాదు మానసిక ఉల్లాసానికీ శాకాహారమే మంచిది. శాకాహార భోజనం సులువుగా జీర్ణమవుతుంది. ఆరోగ్య సమస్యలూ పెద్దగా తలెత్తవు. శాకాహారం తీసుకోవడం ద్వారా జీవ హింసలో భాగం కాకుండా ఉండొచ్చు. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా మాంసాహారం తినలేదు.

– బట్టు నర్సింలు, టీచర్, కామారెడ్డి

అందరం శాకాహారులమే...



మా ఇంట్లో మొదటినుంచి అందరం శాకాహారులమే. సాధారణంగా శాకాహారులలో ఆరోగ్య సమస్యలు పెద్దగా కనిపించవు. ఏది పడితే అది తిని ఇబ్బంది పడేకన్నా.. శాకాహార భోజనం తినడమే మంచిది.

– రమాకాంత్, ఫొటోగ్రాఫర్, కామారెడ్డి

మాంసం ముట్టేది లేదు..



మనం పచ్చి కూరగాయలు తినగలుగుతాం. అదే పచ్చి మాంసం తినలేం. శాకాహార భోజనం ఆరోగ్యానికి మంచిది. మా ఇంట్లో అందరూ శాకాహారులే. జీవితంలో మాంసం ముట్టేది లేదు. మా ఇంట్లో ఎవరూ తినరు. ఎవరైనా తాగినా, తిన్నా ఇంట్లో చోటుండదు.

– హరినాథ్, ఫొటోగ్రాఫర్, కామారెడ్డి

ఆరోగ్యం బాగుంటుంది



మాంసాహారిగా ఉన్నప్పుడు ఆరోగ్య సమస్యలు వచ్చాయి. శాకాహారిగా మారాక అవి దూరమయ్యాయి. బతికినన్ని రోజులు మాంసాహారం జోలికి వెళ్లను. మద్యమే కాదు.. శీతల పానీయాలూ ముట్టుకోను.

– ఎల్లయ్య, ఎంఈవో, కామారెడ్డి

‘అమరుల త్యాగాలను స్మరించుకోవాలి’



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కామారెడ్డి టౌన్: దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్య్ర సమరయోధులు, సైనికుల త్యాగాలను సదా స్మరించుకోవాలని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ‘మేరీ మాటీ.. మేరా దేశ్’ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా కలశంలో మట్టిని సేకరించారు. స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ఏకం చేసేందుకే ప్రధానమంత్రి ‘మేరీ మాటీ.. మేరా దేశ్’ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. శనివారంతో మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం ముగిసిందన్నారు. అన్ని గ్రామాలనుంచి సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపిస్తామన్నారు. అక్కడ ఈ మట్టితో అమరుల స్మారకార్థం అమృత్ వాటిక నిర్మిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

గర్జించిన లబాన్ లంబాడీలు



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న లబాన్ లంబాడీలు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

- జిల్లా కేంద్రంలో వేలాది మందితో ర్యాలీ
- ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్
- నిజాంసాగర్ చౌరస్తాలో రాస్తారోకో
- కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

కామారెడ్డి టౌన్: లబాన్ లంబాడీలు శనివారం జిల్లా కేంద్రంలో కదం తొక్కారు. ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ నినదించారు. ఈ డిమాండ్‌తో వివిధ జిల్లాలనుంచి లబాన్ లంబాడీలు శనివారం జిల్లాకేంద్రంలోని సీఎస్ఐ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పలువురిని అరెస్టు చేయడానికి పోలీసులు యత్నించగా.. తప్పించుకుని కొత్తబస్టాండ్‌వైపు పరుగులు తీశారు. అక్కడి నుంచి నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకుని గంటన్నరపాటు ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ముందస్తుగానే పోలీసులు కలెక్టరేట్ వద్ద బారికేడ్లు పెట్టి వారిని అడ్డుకున్నారు. దీంతో ఆందోళనకారులు కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. ఆందోళనకారులు లోపలికి వెళ్లేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. కలెక్టర్ రావాలని, అరెస్ట్ చేసిన తమ నేతలను విడిపించాలని లబాన్ లంబాడీలు పట్టుబట్టారు. దీంతో పోలీసులు తమ అదుపులో ఉన్న లబానా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. అనంతరం కలెక్టర్‌ను కలవడానికి పోలీసులు 20 మందికి అనుమతి ఇచ్చారు. వారు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు బంతిలాల్, బన్సీలాల్ మాట్లాడుతూ 1977 గెజిట్‌లో లంబాడీలుగా గుర్తింపు ఉన్నందున ఎస్టీగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చి మోసం చేశాడని, ఇందుకు నిరసనగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో 1,116 నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు. పోడు భూమి పట్టాలు ఇవ్వాలని, 10 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లబాన్ లంబాడా సంఘం నాయకులు జగదీష్, చందానాయక్, రథీరాం, అమర్‌సింగ్‌నాయక్, బిషన్‌లాల్, ఉదల్ సింగ్, భజన్‌లాల్, దర్బార్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఝూటా లీడర్

- డిమాండ్ల సాధన కోసం ప్రగతిభవన్ ముట్టడిస్తాం
- లబానా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్



మాట్లాడుతున్న తాన్‌సింగ్

కామారెడ్డి టౌన్: తమను ఎస్టీలలో చేరుస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చి మాట మార్చిన కేసీఆర్ లాంటి ఝూటా నాయకుడిని తాము ఇప్పటివరకు చూడలేదని లబానా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ విమర్శించారు. మహాగర్జన ర్యాలీ నేపథ్యంలో ఆయనను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు.. శనివారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటిదాకా సీఎం కేసీఆర్ మాతో పాచికలాడారని, ఇకపై తాము పాచికలు వేస్తామన్నారు. చెల్లప్ప కమిషన్ ఇచ్చిన నివేదికకు విలువ లేకుండా పోయిందన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చడం కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపడం తప్ప కేసీఆర్ చేసిందేమిటో చెప్పాలన్నారు. జీవో 245 అమలు చేయకపోతే ఐదో తేదీ తర్వాత ప్రగతిభవన్, సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. డిమాండ్లను నెరవేర్చకపోతే అధికార పార్టీలో ఉన్న తమ సమాజానికి చెందిన నాయకులు రాజీనామా బాట పడతారన్నారు.

క్లుప్తంగా

'సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఫస్ట్'



మాచారెడ్డి: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. శనివారం పాల్వంచ మండల కేంద్రంతో పాటు ఆరేపల్లి, భవానీపేట, వెల్పుగొండ, వాడి, మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం వద్ద చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు గ్రామాల్లో రూ. 12 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. చుక్కాపూర్ ఆలయ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ కోటి రూపాయలు మంజూరు చేశారన్నారు. నియోజక వర్గంలోని అన్ని ఆలయాలకు నిధులిచ్చారన్నారు. ఫరీదుపేటలో రూ. 45 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం బాగుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆశం భాగ్యమ్మను అభినందించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌నే మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమాలలో ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, సర్పంచులు లింగారెడ్డి, సునీత, తిరుపతిరావు రావు, మంజుల, భాగ్యమ్మ, ఆలయ కమిటీ చైర్మన్లు కమలాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బావులతో భూగర్భ జలాల వృద్ధి

- జిల్లాలో 25 బావులు గుర్తించాం
- అభివృద్ధికి రూ.80 లక్షల నిధులు విడుదల చేశాం
- చారిత్రక కట్టడాలకు పునర్వైభవం తీసుకురావడమే మా ఉద్దేశం
- ఫౌండర్ ఆఫ్ ది రెయిన్ వాటర్ వ్యవస్థాపకులు కల్పనా రమేశ్



మెట్ల బావిని పరిశీలిస్తున్న ఇన్ఫోసిస్ బృందం



లింగంపేటలో మాట్లాడుతున్న కల్పనారమేశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): కాకతీయుల కాలంలో భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి మోటబావులు, చేదబావులు తవ్వించే వారని చరిత్ర ద్వారా తెలుస్తుందని ఫౌండర్ ఆఫ్ ది రెయిన్ వాటర్ ప్రాజెక్టు వ్యవస్థాపకులు కల్పనా రమేశ్ అన్నారు. శనివారం ఆమె లింగంపేట మండల కేంద్రంలోని జక్సాని నాగన్నగారి దిగుడు మెట్ల బావిని ఇన్ఫోసిస్ ఉద్యోగుల బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మెట్ల బావి 17 నుంచి 18 వందల సంవత్సరంలో నిర్మించినట్లు భావిస్తున్నామన్నారు. జిల్లాలో 25 బావులు ఉన్నట్లు గుర్తించామని, చారిత్రక కట్టడాలకు పునర్వైభవం తీసుకురావడానికి ఫౌండర్ ఆఫ్ ది రెయిన్ వాటర్ ప్రాజెక్టు సంస్థ ముందుకు వచ్చినట్లు తెలిపారు. తమతో పాటు మరి కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఐలు బావులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. లింగంపేట మెట్ల బావి అభివృద్ధి కోసం నిధులు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ జితేష్, లింగంపేట జీపీ సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం రూ. 80 లక్షలు బావి అభివృద్ధి కోసం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బావి వద్ద చేపడుతున్న పనులు డాక్యుమెంటరీ రూపంలో బుక్కు తయారు చేయిస్తామన్నారు. మరో ఆరు నెలల్లో పర్యాటక కేంద్రంగా రూపొందించనున్నట్లు వివరించారు.

ఆకట్టుకున్న నృత్యాలు

ఇన్ఫోసిస్ బృందం సభ్యులు లింగంపేట మండలం పర్మళ్ల మాలోత్ తండాను సందర్శించారు. తండాలో గిరిజనులతో సమావేశమయ్యారు. గిరిజనుల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి నృత్యాలు చేశారు. ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్, కన్జర్వేషన్ ఆర్కిటెక్ ఫ్రమ్ హెరిటేజ్ మెంటర్స్ వాత్సల్య, 40 మంది బృందం సభ్యులు, స్థానిక సర్పంచ్ బొల్లు లావన్య, ఎంపీపీ గరీబున్నిసాబేగం, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యం చేస్తున్న బృందం సభ్యులు

పోచారం ప్రాజెక్టు సందర్శన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం ప్రాజెక్టును శనివారం ఇన్ఫోసిస్ బృంద సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించి అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో వారు చర్చించారు.

స్పోర్ట్స్ మీట్‌లో సత్తాచాటిన మైనార్టీ విద్యార్థినులు



బహుమతులతో విద్యార్థులు



గాంధారిలో మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వర్ గౌడ్

బాన్సువాడ రూరల్: మండలంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన క్రీడా పోటీల్లో సత్తాచాటారని ప్రిన్సిపల్ కౌసర్ బేగం తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు పోటీలు జరిగాయి. కబడ్డీ అండర్–17 విభాగంలో ప్రథమ బహుమతి, వాలీబాల్ అండర్–14 విభాగంలో ద్వితీయ బహుమతి,ఖో–ఖో అండర్–17,అండర్–14 విభాగాల్లోనూ ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. దీనిలో భాగంగా శనివారం నిర్వహించిన అభినందన సభలో బహుమతులు సాధించిన విద్యార్థులతో పాటు ప్రోత్సహించిన పీఈటీ ప్రియాంకను ప్రిన్సిపల్ కౌసర్ బేగం అభినందించారు.

వాలీబాల్ జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక

గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో శనివారం వాలీబాల్ ఎల్లారెడ్డి జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక జరిగినట్లు పీడీ వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి జోన్ పరిధిలోని ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట్ మండలాలకు చెందిన అండర్–14, అండర్–17 బాలబాలికలకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 48 మంది ఎంపికైనట్లు తెలిపారు.

సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి



మాట్లాడుతున్న జిల్లా సబ్ డివిజనల్ జడ్జి భార్గవి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పంటల సాగులో రైతులకు ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత వ్యవసాయధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా సబ్ డివిజనల్ జడ్జి భార్గవి అన్నారు. శుక్రవారం అడ్లూర్‌ఎల్లారెడ్డిలో రైతువేదిక భవనంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. రైతు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు ఎరువుల దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. ఇచ్చిన విత్తనాలు నకిలీవని తేలితే వెంటనే న్యాయపరమైన కేసులు నమోదు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలో ఇద్దరు పారాలీగల్ వాలంటీర్లను ఏర్పాటు చేశామని, సమస్యలుంటే వెంటనే వారి దృష్టికి తీసుకురావాలన్నారు. సర్పంచ్ పైడి జానకి, ఎంపీటీసీ సంకరి లక్ష్మీరాజలింగం, విండో చైర్మన్ సదాశివరెడ్డి, ఏఈవో శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు రమేశ్‌రెడ్డి, మోహన్, గణేశ్, పారాలీగల్ వాలంటీర్లు శిరీష, స్వప్న పాల్గొన్నారు.

ప్రధాని సభకు భారీ బందోబస్తు

- వాయుసేన హెలికాప్టర్‌తో ఏరియల్ సర్వే
- జీజీ కాలేజీ గ్రౌండ్‌ను అధీనంలోకి తీసుకున్న ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ
- 2 వేల మంది పోలీసులతో పహారా : సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: ఈ నెల 3న నిజామాబాద్ జిల్లాకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానున్న సందర్భంగా పోలీసుల భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. స్థానిక గిరిరాజ్ కళాశాల మైదానంలో జరిగే మోదీ సభ ప్రాంగణాన్ని ఎస్పీజీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ కంట్రోల్‌లోకి తీసుకున్నాయి. ఎస్పీజీ, ఎన్ఎస్‌జీకి చెందిన ఐజీ, డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు 50 మంది వరకు ఇక్కడికి చేరుకొని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శనివారం ఉదయం, మధ్యాహ్నం వాయుసేనకు చెందిన హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానంలో, హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి హెలికాప్టర్‌లో వస్తారని అధికార వర్గాల ద్వారా తెలిసింది. జిల్లా నూతన కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌తో పాటు ఎస్పీజీ, స్థానిక అధికారులతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఎస్పీజీ, ఎన్ఎస్‌జీకి దళాలు గిరిరాజ్ కళాశాల మైదానంలో జరిగే సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. సభా ప్రాంగణాన్ని అదుపులోకి తీసుకుని అణువణువునా పరిశీలిస్తున్నారు. తెలంగాణ పోలీసు అధికారుల ద్వారా ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ అధికారులు వివరాలను తెలుసుకుంటున్నారు. గ్రౌండ్ బయట జిల్లా పోలీసుల ఆధీనంలో ఉంటుంది. నూతన సమీకృత కలెక్టరేట్ నుంచి సభా ప్రాంగణం వరకు 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు ఏడుగురు సీపీలు, 12 మంది అదనపు డీసీపీలు, 37 మంది ఏసీపీల తోపాటు సీఐలు, ఎస్సైలు కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్లలతో కలిసి 2 వేల మంది పాల్గొంటారని సీపీ సత్యనారాయణ తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

ఖలీల్‌వాడి: మున్సిపల్ కార్మికులు ఈ నెల 8 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. సమ్మెకు సంబంధించిన నోటీసును మున్సిపల్ మేనేజర్‌కు శనివారం అందజేశారు. సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. ఈ నెల 3న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందించిన వారిలో నాయకులు చంద్రసింహ, మోహన్, లక్ష్మణ్, సంతోష్ గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

'2.78 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం'




ఎల్లారెడ్డి: జిల్లాలోని 697 చెరువులలో 2.78 కోట్ల చేప పిల్లలు, 60 లక్షల రొయ్య పిల్లలను వదలడం లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తెలిపారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువులో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 64 చెరువులలో 35 లక్షల చేప పిల్లలను వదిలామన్నారు. పక్షం రోజుల్లో చేప పిల్లల పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషాగౌడ్, కౌన్సిలర్ సాయిలు, మత్స్యకార సంఘం నాయకులు శంకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ టెక్నికల్ ఉద్యోగుల సమ్మె ప్రారంభం



కామారెడ్డి టౌన్: పంచాయతీరాజ్ శాఖ టెక్నికల్ ఉద్యోగులు శనివారం సమ్మె ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో తెలంగాణ ఈపంచాయతీ టెక్నికల్ వింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాటి శంకర్ మాట్లాడారు. 13 ఏళ్లుగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లుగా, ఈపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్నామన్నారు. తమకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ హోదా ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రెంజల్(బోధన్): మహారాష్ట్ర నుంచి వస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి బోధన్‌కు సుమారు 300 క్వింటాళ్ల బియ్యాన్ని బోధన్‌కు తీసుకొస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు కందకుర్తి వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు

నిజామాబాద్ రూరల్: భూవివాదంలో మృతి చెందిన మండలంలోని కేశాపూర్ గ్రామానికి చెందిన ఉమ్మాయి సత్యంరెడ్డి అంత్యక్రియలు పోలీసుల పికెట్ మధ్య శనివారం ముగిశాయి. ఈ నెల 19న సత్యంరెడ్డిపై బీరుసీసాతో చిన్నారెడ్డి, గంగాధర్ దాడి చేయడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జరగాల్సిన అంత్యక్రియలు శనివారం జరగడంతో పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు.

'అభివృద్ధి చేసే వారిని ఆదరించాలి'



హన్మాజీపేట్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్: నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి చేసే వారినే ప్రజలు ఆదరించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం హన్మాజీపేట్‌లో రూ.65 లక్షలతో నిర్మించిన మున్నూరుకాపు కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హన్మాజీపేట్‌లో అభివృద్ధి పనులకు సుమారు రూ.7 కోట్లు మంజూరు చేశానన్నారు. సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే మిర్గం నాటికి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు స్థాయికి తగిన విమర్శలు చేయాలని, బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలని హితవు పలికారు. అంతకు ముందు రూ.20 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే సర్పంచ్ బోనాల సుభాష్ తన సొంత స్థలాన్ని విరాళంగా ఇవ్వడంతో అక్కడ రూ.13 లక్షలతో నిర్మించిన బీడీ కార్మికుల సంఘ భవనాన్ని ప్రారంభించారు. పద్మశాలి కులసంఘం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, సర్పంచ్ బోనాల సుభాష్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, నాయకులు సంగ్రాం నాయక్, నారాయణరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, శ్రీకాంత్, సాయిలు, బాలయ్య, సాయిరాం, సాయిబాబా, అక్బర్, శంకర్‌గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవహారంగా ఏర్పడి ఆశాల నిరసన



ఎల్లారెడ్డిలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు



భిక్కనూరులో..

సాక్షి నెట్‌వర్క్:తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లాలో చేపట్టిన సమ్మె శనివారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు పలు మండలాలు, గ్రామాల్లో మానవహారాలుగా ఏర్పడి నిరసన తెలిపారు. సమ్మెకు వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

'నైతిక బాధ్యతగా ఓటేయాలి'



ప్రశంసా పత్రాలను అందిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరు నైతిక బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడానికి ఇటీవల పాఠశాల స్థాయిలో నాటక, పాటల పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో గెలుపొందినవారికి శనివారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా యువ ఓటర్లను ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయడానికి ఏడాదిలో నాలుగు సార్లు ఓటరు నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. ఓటరుగా నమోదు చేసుకున్న కొత్త ఓటర్లకు త్వరలో నిర్వహించే ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లభిస్తుందన్నారు. విజ్ఞతతో ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, విద్యాశాఖ ప్రతినిధి శ్రీపతి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాము కాటుతో బాలిక మృతి

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో పాము కాటుతో అనూజ (6) అనే బాలిక మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని విషపురుగు కుట్టడంతో అస్వస్థతకు గురైంది. గమనించిన తండ్రి స్వామి నవీపేట లోని ఆసుపత్రికి తరలించగా పాముకాటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

నేడు అర్చకులకు శిక్షణ

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ధూపదీప నైవేద్యం అర్చకులకు నేటి నుంచి ఆలయాల్లో నిర్వహించే పూజలపై పునశ్చరణ శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు రాచప్ప, అంజనప్ప శనివారం తెలిపారు. మాధవ నగర్ సాయిబాబా ఆలయంలో గ్రామ దేవత, వైదిక స్మార్థ అర్చకులకు మాత్రమే శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

క్యాంపస్‌లో ఏబీవీపీ హెల్ప్ డెస్క్



తెయూ(డిచ్‌పల్లి): తెయూలో ఐసెట్, సీపీజీఈటీ నూతన విద్యార్థుల ప్రవేశాల నమోదు ప్రక్రియలో భాగంగా శనివారం క్యాంపస్ ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ ప్రారంభించారు. కౌన్సెలింగ్ ద్వారా యూనివర్సిటీ ప్రవేశాలు పొందిన నూతన విద్యార్థుల సందేహాలు తీర్చడానికి వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. హెల్ప్‌డెస్క్ సేవలు అడ్మిషన్ ప్రక్రియ ముగిసే వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే 9014748454, 830950484 నంబర్లను సంప్రదించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శివ తెలిపారు.

క్రైం కార్నర్

కరెంట్ టవర్ ఎక్కిన యువకుడు



టవర్‌పై కూర్చున్న షేక్ అఫ్రోజ్

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌లో భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు కరెంట్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌కు చెందిన షేక్ అఫ్రోజ్‌కు ఆర్యనగర్‌కు చెందిన యువతితో వివాహం జరిగింది. నాలుగు నెలల క్రితం తల్లిగారింటికి వచ్చిన అఫ్రోజ్ భార్య తిరిగి బోధన్‌కు వెళ్లలేదు. దీంతో మద్యం మత్తులో కరెంట్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. దీంతో పోలీసులు ఊపరిపీల్చుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి: దేవునిపల్లి శివారులో ఉన్న పోచారం కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేశ్ శనివారం తెలిపారు. పోచారం కాలువలో గుర్తుతెలియని మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుడి జేబులో బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డికి ఈనెల 29న ఉదయం ప్రయాణించినట్లు ఉన్న బస్ టికెట్ ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మేకలను మింగిన పాము



సిరికొండ: హుస్సేన్‌నగర్ గ్రామంలో పెంజర పాము రెండు మేకలను మింగినట్లు గ్రామస్తులు తెలిపారు. పోచమ్మ ఆలయ సమీపంలో గ్రామానికి చెందిన గొల్ల నాగేశ్‌కు చెందిన కొట్టంలోకి పాము చొరబడి రెండు మేకలను మింగింది. గమనించిన నాగేష్ గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా పామును చంపేసినట్లు తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

వర్ని: మండలంలోని కూనీపూర్ అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో మేక మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. కొంత కాలంగా అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు రైతులు వెల్లడించారు. అడవిలోకి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

గణేశ్ విగ్రహాల నిమజ్జనంలో ఘర్షణ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. డీజే పాటల విషయంలో గణేశ్ మండలి నిర్వాహకుల మధ్య మాటామాట పెరిగి దాడులకు పాల్పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. బాన్సువాడ పోలీసులు గ్రామానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టి బందోబస్తు నిర్వహించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు సంయమనం పాటించాలని సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు.